మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## చిన్న ఘనపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలను సిఇవో ఆకస్మిక తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో ఎల్లయ్య

**కొల్చారం, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని చిన్నఘనపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా విద్యాధికారి రాధాకృష్ణ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి చేరిన ఎన్నికల సామాగ్రి

**నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 7, (ప్రభాతవార్త):** స్థానిక సంస్థల ఎన్నికల సామాగ్రి శుక్రవారం మండలానికి చేరుకుంది. మండల కేంద్రమైన నాగల్‌గిద్దలోని మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్న ఎన్నికల సామాగ్రిని ఎంపిడిఒ మహేశ్వరరావు పరిశీలించారు. మండలంలోని 33 గ్రామ పంచాయితీలకు చెందిన ఎన్నికల సామాగ్రి వచ్చినట్లు ఎంపిడిఒ పేర్కొన్నారు.



మండలానికి చేరిన స్థానిక సంస్థల ఎన్నికల సామాగ్రి దృశ్యం



డబుల్ బెడ్ రూం ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కాంత్రి వల్లూరు

## డబుల్ బెడ్‌రూం ఇళ్లకు అన్ని వసతులు కల్పించాలి

**-సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు డబుల్ బెడ్ రూం ఇండ్లలో అన్న రకాల వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. శుక్రవారం కొల్లూరు కాలనీలో ప్రజలు, ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ కాలనీలో 7258 కుటుంబాలకు చెందిన 30వేలకు పైగా జనాభా కాలనీకి వచ్చే అవకాశం ఉందని, అందుకు కాలనీని పట్టణాన్ని తలదన్నేలా అన్ని రకాల వసతులు (ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రం, తాగునీటి వసతి, మురుగునీటి పారుదల వ్యవస్థ, లిఫ్ట్ మరమ్మత్తులు, డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటు, బస్సు సౌకర్యం, టెలికమ్యూనికేషన్స్, రేషన్ దుకాణం, పోలీసు సెక్యూరిటీ లాంటి సౌకర్యాలు) కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేసుకోవాలని సూచించారు. కాలనీలోని ప్రజల తో కలెక్టర్ మాట్లాడి సమస్యలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఈఓ వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిణి లలితకుమారి, ఆర్‌డిఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంగ్రామ్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## సిద్దిపేట వైద్యుడికి వైద్య శిరోమణి అవార్డు



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డా॥భాస్కర్

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని లోహిత్ సాయి ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ భాస్కర్‌కు వైద్య శిరోమణి అవార్డు లభించింది. ఈ మేరకు హైదారాబాద్‌లోని త్యాగరాయ గానసభలో తేజస్విని కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైద్యరంగానికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టర్ భాస్కర్‌కు వైద్య శిరోమణి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ఖర్చులో కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమన్నారు. సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

### ప్రజ్ఞాపూర్ వైద్యులకు...



గవర్నర్ నుంచి వైద్యశిరోమణి అవార్డు అందుకుంటున్న డాక్టర్ లింగం

**గజ్వేల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వ భాష సాంస్కృతిక శాఖ సహకారంతో తేజస్విని కల్చరల్ ఆధ్వర్యంలో దాశరథి శతజయంతి ఉత్సవాల సందర్భంగా త్యాగరాయ జ్ఞానసభలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రజ్ఞాపూర్‌కు చెందిన ప్రముఖవైద్యులు డాక్టర్ ఎలిశాల లింగం, డాక్టర్ ఎలిశాల శైలజలు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా వైద్య శిరోమణి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సేవలో అత్యున్నత సేవలు అందించినందుకు వైద్య శిరోమణి అవార్డు వచ్చిందని, ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర గవర్నర్ చేతులమీదుగా వైద్య శిరోమణి అవార్డు అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

## కెసిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

**వర్గల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన శ్రీ మల్లికార్జున క్షేత్ర ప్రతిష్ట మహోత్సవం ఈనెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు జరగనుండగా శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు మాజీ జెడ్‌పిటిసి బాల మల్లుయాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నేతలు ఎర్రవల్లిలోని ఫాం హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. యాదవుల కుల దైవమైన మల్లికార్జునస్వామితో పాటు శ్రీ భ్రమరాంబిక, శ్రీ కేతమ్మ విగ్రహాలు ప్రతిష్టించడం జరుగుతుందని యాదవ సంఘం నేతలు కెసిఆర్‌కు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం ఉంటుందని, ప్రతిష్ట మహోత్సవానికి తప్పకుండా హాజరవుతానని కెసిఆర్ చెప్పినట్లు నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్గల్ మండల పార్టీ అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవగనిక నాగరాజు, యాదవ సంఘం సభ్యులు బిక్షపతియాదవ్, యాదయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌తో యాదవ సంఘం నేతలు

# రైతులకు లాభం చేకూరేలా విద్య కొనసాగాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని రైతులకు అత్యధికంగా లాభం చేకూర్చేందుకు ఉపయోగపడేలా విద్య నేర్చుకోవాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల గ్రామ పరిధిలోని ప్రొ॥ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ముడి పదార్థాల అవసరాలను తీర్చడం, ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం అత్యంత ప్రబలమైన రంగమని తెలిపారు. జనాభాలో అధిక శాతం మంది జీవనోపాధి కోసం వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ సేద్యం వ్యవస్థలు, మైక్రో ఇరిగేషన్ సిస్టమ్స్ ద్వారా నీటి నిర్వహణ సహా సమగ్ర నీటి నిర్వహణ కార్యకలాపాలు, సేంద్రీయ వ్యవసాయ ప్రోత్సహించడం ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుదల ఫీల్డ్ స్థాయిలో శిక్షణలు, ప్రదర్శనలు సమీకృత పోషక నిర్వహణ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ పద్దతులు స్వీకరించడం ద్వారా సాగు ఖర్చును తగ్గించాలనే లక్ష్యంగా ఉండాలన్నారు. రెండు సంవత్సరాల కోర్సులో ప్రతి అంశాన్ని క్లుప్తంగా నేర్చుకొని వ్యవసాయంలో ఒక నూతన ఒరవడులను సృష్టించి రైతులకు లాభం చేకూర్చేలా మీ విద్య కొనసాగాలని అలాగే సబ్జెక్ నేర్చుకోవాలనే అసక్తి మీలో ఉండాలన్నారు. వ్యవసాయ కోర్సు అనేది మారుతున్న కాలంతో పాటు ఆలోచన విధానం కూడా ఎప్పుడు డెవలప్ చేసుకుంటూ ఉండాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు ప్రిన్సిపల్ శ్రీదేవి కళాశాలలోని సౌకర్యాలను, కోర్సులను వివరించారు.



ప్రొ॥ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

# ప్లాట్ల సమస్య పరిష్కారానికి కృషి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్.. రాజగోపాల్ నగర్ ప్లాట్‌ల బాధిత సమస్యలు విన్న హైడ్రా కమీషనర్

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లోని రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ ఫిర్యాదు మేరకు బాధితుల ప్లాట్‌ల సమస్యలను వినేందుకు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ విచ్చేశారు. స్థానిక సుప్రీం కోర్టు న్యాయవాది ముఖీం అక్కడకు వచ్చి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో దురుసుగా మాట్లాడుతూ మీకు తెలుగు వచ్చా అని కమిషనర్‌ను ప్రశ్నించడంతో మీకు ఏదైనా ఇబ్బంది ఉంటే మాకు తెలియజేయాలని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడొద్దని కమీషనర్ రంగనాథ్ హెచ్చరించారు. అనంతరం విలేకరులతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ రెండు వారాల్లో లోతుగా పరిశీలించి ఇరు వర్గాల వారు చెప్పింది వింటామని చెప్పారు. అలాగే కోర్టు పరిధిలో ఉన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని రెండు నెలల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు.ఇక్కడ కొంతమంది భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేస్తున్నట్లుగా అర్థమవుతుందని తెలిపారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉన్నచోటికి గ్రామస్థులతో కలిసి న్యాయవాది ముఖీం వచ్చారు. వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఆయనను అక్కడి నుంచి పంపించేశారు.



మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైడ్రా కమిషనర్ రంగనాథ్, న్యాయవాది ముఖీం మధ్య వాగ్వాదం..**

హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐలాపూర్ స్థానికుడు సుప్రీంకోర్టు న్యాయవాది ముఖీం మధ్య ఐలాపూర్ భూముల విషయంలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఐలాపూర్ భూములపై సుప్రీం కోర్టులో కేసు ఉండగా మీరు ఎలా వస్తారంటూ హైడ్రా కమిషనర్‌ను లాయర్ ముఖీం ప్రశ్నించారు. మీకు తెలుగు వచ్చా అంటూ ముఖిమ్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. కమిషనర్ రంగనాథ్ స్పందించి మీరు చెప్పేది చెప్పండి ఓవరాక్షన్ చేయొద్దు అంటూ ముఖీంపై రంగనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అమాయకులను రెచ్చగొట్టి లాభం పొందాలని చూస్తే ఊరుకోబోమని కమీషనర్ రంగనాథ్ హెచ్చరించాడు.

# చెలకపల్లి గ్రామస్థులను మోసం చేసిన ఘనత హరీష్‌రావుదే

### ఉత్తరాల పేరిట కొత్త డ్రామాలు ఆడడం సిగ్గుచేటు.. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ యాదవ్

**చిన్నకోడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చెలకలపల్లి గ్రామ ప్రజలను మోసం చేసిందే మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగ మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ముంపుకు గురవుతున్న చెలకపల్లి గ్రామంలో ప్రజలతో కలిసి ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి సొంత నియోజకవర్గ గ్రామాలను ఏనాడూ పట్టించుకో లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నపూర్ణ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురైనా చెలకపల్లి, కాసరంపల్లి, ఎల్లాయిపల్లి గ్రామాలకు నష్టపరిహారం ఇవ్వకుండా పక్క నియోజకవర్గ పరిధిలోని అంతగిరి గ్రామానికి నష్టపరిహారం అందించి నియోజకవర్గ ప్రజలను మోసం చేసిన ఘనత హరీష్‌రావుకే దక్కుతుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకగ్రీవం పేరిట చెలకలపల్లి గ్రామస్తుల ఓట్లు దండుకొని మంత్రిగా ఉండి అధికారుల ఆదేశాలతో 2016లో గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి ప్యాకేజీ ఇస్తున్నట్లు నాటకం ఆడి మోసం చేశారని తెలిపారు. బిఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోగానే గ్రామ ప్రజలపై మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మంత్రిగా పనిచేసినప్పుడు చెలకపల్లి గ్రామం గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేసి ఉత్తరాల పేరుతో హరీష్‌రావు ఆడుతున్న డ్రామాలను ప్రజలు నమ్మరని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు ముంపు గ్రామస్తుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టగానే హరీష్‌రావు కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. చెలకపల్లి గ్రామస్తులు ఇబ్బందులను జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, జగ్గారెడ్డిల దృష్టికి తీసుకెళ్లాగా న్యాయం జరిగేలా చూస్తామని తెలిపినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సందబోయిన పర్శ రాములు, పకాల భూపతిరెడ్డి, ఉడుత జయంత్, నముండ్ల వినోద్, పుచ్చకాయల వెంకట్‌రెడ్డి, తిరుపతి రెడ్డి ఎగుల్ల రాములు, చిన్న రాములు పాల్గొన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మహేందర్‌యాదవ్

# బిసి బంధులో అక్రమాలు

### అందని చెక్కులు-డ్రా చేసినట్లు లెక్కలు

**పాపన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:**

గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన బీసీ బంధు పథకం అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. లబ్దిదారులకు చెక్కులు అందకుండానే ఆ చెక్కులు డ్రా అవడంతో లబ్దిదారులు నివ్వెరపోతున్నారు. మండలంలోని బీసీ వర్గాలకు చెందిన సుమారు 169 మందికి పలు రకాల యూనిట్లు మంజూరు(గ్రౌండింగ్) చేశారు. అయితే ప్రభుత్వం లబ్దిదారులకు ఇచ్చిన చెక్కులు (15 మందికి) అందకపోగా ఆ చెక్కులు మాత్రం డ్రా అయ్యాయి.

**గ్రామాల వారీగా మంజూరైన యూనిట్లు...**

మండల కేంద్రమైన పాపన్నపేటకు 18, అబ్లాపూర్‌కు 3, అన్నారంకు 3, ఆర్కెలకు 8, బాచారంకు 6, చికోడ్‌కు 6, చిత్రియాలకు 9, దౌలాపూర్‌కు 1, ఎల్లాపూర్‌కు 9, గంధార్‌పల్లికి 10, కొడుపాకకు 8, కొంపల్లికి 5, కొత్తపల్లికి 13, ముద్దాపూర్‌కు 1, నాగ్సాన్‌పల్లికి 6, నార్సింగ్‌కు 6, పొడ్చెన్‌పల్లికి 17, రామతీర్థంకు 4, యూసుఫ్‌పేట్‌కు 8 చొప్పున మండలానికి 169 యూనిట్లు మంజూరయ్యాయి. లబ్దిదారులు వారివారి యూనిట్ల ప్రకారం పనిముట్లు, సామాగ్రి కొనుగోలు చేసుకునేందుకు చెక్కులు అందచేశారు. బీసీ బంధు సొమ్మును కొందరు అక్రమార్కులు లబ్దిదారులకు అందచేయకుండా కుంభకోణానికి తెరలేపారు. పాపన్నపేటకు చెందిన మంగళి ప్రేమ్‌కుమార్ డిడి నంబర్ 217666తో మంగలి లక్ష్మణ్ 217615తో పాటు మల్లంపేటకు చెందిన మంగళి యాదుల్లా 217404తో పాటు లింగాయపల్లి మంగలి సాయిలు 217415 పేర్లతో చెక్కులు 7 అక్టోబరు 2023న ఆయా బ్యాంకులలో వారికి తెలియకుండానే డబ్బులు డ్రా చేసినట్లు సమాచారం. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 15 మంది లబ్దిదారులకు చెక్కులు అందచేయకుండా అక్రమార్కులు డబ్బులను డ్రా చేసుకున్నట్లు తెలుస్తోంది.

**లబ్దిదారులకు లక్ష రూపాయల చొప్పున...**

ఒక్కో లబ్దిదారుడికి 1 లక్ష రూపాయల చొప్పున మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.మంజూరైన చెక్కులు లబ్దిదారులకు అందకుండా వారి పేర్లపై చెక్కులు డ్రా చేయడంలో ఏ శాఖ అధికారుల హస్తం ఉందో తెలియాల్సిన అవసరం ఉంది.

జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, బిసి సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో బీసీ కార్పొరేషన్ యూనిట్లపై అధికారులు విచారణ చేయాల్సిన అవసరం ఉంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అక్రమార్కులు మింగేసిన డబ్బులను కక్కించి లబ్ది దారులకు అందించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని బిసి వర్గాలు డిమాండ్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న సుప్రీం కోర్టు అడ్వకేట్ ముఖీం

## హైడ్రా కమిషనర్‌పై కోర్టులో కేసు వేస్తాం

**-సుప్రీంకోర్టు అడ్వకేట్ ముఖీం**

**అమీన్‌పూర్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ రాజగోపాల్ నగర్ లేఅవుట్ పూర్తిగా ఫ్రాడ్ అని సుప్రీంకోర్టు అడ్వకేట్ ముఖీం అన్నారు. శుక్రవారం ఐలాపూర్‌లో ఆయన మాట్లాడుతూ 1972 సంవత్సరంలో లేఅవుట్ అయితే 1986లో ప్లాట్‌లు ఎలా వస్తాయని ప్రశ్నించారు. కోర్టు కొట్టేసి, సక్సేషన్ కాని ముస్లింల వద్ద కొనుగోలు చేసిన ప్లాట్‌లు ఎట్టి పరిస్థితుల్లో వారికి చెందవన్నారు. రెండు నెలల్లో రాజగోపాల్ నగర్‌లోని ప్లాట్‌లను ఇప్పిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఎలా చెప్తాడన్నారు. సర్వే నంబర్లు 176, 177లలో శిఖం భూమిలో టెంట్ వేయమని చెప్పి సమావేశమైన రంగనాథ్ హైకోర్టు ఆర్డర్‌ను ధిక్కరించారన్నారు. సుప్రీం కోర్టులో కేసు ఉందని చెప్పినా కమిషనర్ వినకుండా తన పని తాను చేసుకుంటున్నాడన్నారు. హైడ్రా పోలీసుస్టేషన్‌ను కూడా మేము అడ్డుకుంటామని, హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు కోసం ఏ యాక్టులో లేదన్నారు. పోలీసులను పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. హైకోర్టులో రంగనాథ్‌పై కేసు వేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు గ్రామస్థులు ఉన్నారు.

## ఇంకా కుల వివక్ష కొనసాగడం అమానుషం

**రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**



రమాబాయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 7,ప్రభాతవార్త:** 78 ఏళ్ల స్వాతంత్ర్య పాలనలో కుల వివక్ష కొనసాగడం అమానుషమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సతీమణి రమాబాయి 127వ జయంతిని సిద్దిపేట ఉపాధ్యాయ భవన్‌లో సామాజిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. రమాబాయి చిత్ర పటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అవుతున్న నేటికీ దేశంలో కుల దరంహాకార హత్యలు జరగడం సిగ్గుచేటన్నారు. నగరాలలో దళితులకు ఇంటి అద్దె ఇవ్వకుండా ఇప్పటికీ కుల వివక్ష పాటిస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ రమాబాయిలు కొవ్వొత్తిలాగా కరిగిపోయి కోట్లాది మంది జీవితాలలో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, ఉపాధ్యాయ నేత ఆస లక్ష్మణ్, డిబిఎఫ్ నాయకులు మెట్ల శంకర్, కవి గాయకులు బీమ సేన, ప్రజాసంఘాల నాయకులు శ్రీహరి యాదవ్, శ్రీకాంత్, అస బాబు, డాక్టర్ నర్సింలు, పోతరాజు శంకర్, రాజయ్య, ఎల్లయ్య, రాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ధీరవనిత మాతా రమాబాయి అంబేద్కర్

**కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్**



రమాబాయికి నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** రమాబాయి 127వ జయంతి సందర్భంగా కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం కెవిపిఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి సుందరయ్య భవన్‌లో రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిమేల మానిక్ మాట్లాడుతూ దేశంలోని అణగారిన వర్గాలకు తన జీవితాన్నేకాక, తన పిల్లల జీవితాల్ని త్యాగం చేసిన ధీరవనిత మాతా రమాబాయి అంబేద్కర్ అని అతిమేల మానిక్ అన్నారు. మనువాద విధానాలను తిప్పికొట్టేందుకు సిద్ధం కావాలని, రాజ్యాంగం కాపాడాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అశోక్, సిఐటియు జిల్లా కార్యదర్శి జి సాయిలు జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాలరాజ్ కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దాస్ జిల్లా కమిటీ సభ్యులు దత్తు ప్రభు శ్రీనివాస్ శ్రీకాంత్ రజక సంఘం నాయకులు హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

**రేగోడ్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన రేగోడులో ఈనెల 3వ తేదీ రాత్రి సంసారం విషయంలో భార్యతో గోడవపడి భార్యను, బావమరిదిని కత్తితో పొడిచి పారిపోయిన ద్యారంగుల వెంకయ్యను రేగోడ్ పోలీసులు శుక్రవారం పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు రేగోడ్ ఎస్ఐ పోచయ్య తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ పోచయ్య



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

## రమాబాయి ఘన నివాళులు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మాతా రమాబాయి బాబా సాహెబ్ డాక్టర్ అంబేద్కర్ భార్యగా కేవలం కొందరికి తెలుసు కానీ ఒక మహోన్నత వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన మహోపాధ్యాయురాలు అని, చదువు కోకపోయినా విద్య విలువను ఔపాసన చేసిన మహిళ మాత రమాబాయి అని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పేర్కొన్నారు. శుక్ర వారం రమాబాయి 127వ జయంతిని గజ్వేల్ పట్టణంలోని ఎస్టీ హాస్టల్‌లో విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రమాబాయి ఎంతో కష్టపడి కుటుంబాన్ని నెట్టుకొచ్చిందని, అలాగే అంబేద్కర్ ఆశయ సాధనకు ఆటంకం రాకుండా చూసుకోవడంలో ఆమె చేసిన త్యాగం మరువలేనిదన్నారు. సహచర్యానికి నిలువెత్తు నిదర్శనం రమాబాయి అని, కలిసి ఉండలేకపోయినా కలిసి కట్టుగా దేశాన్ని ముందుకు నడిపించడంలో ఇద్దరిది ఒకే రకమైన పాత్ర అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు



కిరాణా షాపులో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

**గజ్వేల్ టౌన్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తులను ఎవరైనా విక్రయించినా, నిల్వ చేసినా చట్టప్రకారం చర్యలు తీసు కుంటామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవీందర్ సిబ్బందితో కలిసి మున్సిపాలిటీలోని పలు దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న దుకాణాల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు జరిమానా విధించడం జరిగిందని తెలిపారు. నిబంధనలను అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని అన్నారు.

## కెసిఆర్, హరీష్‌రావుల చిత్రపటాలకు క్షీరాభిషేకం



కెసిర్, హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

**చిన్నరోడూరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** నాలుగేళ్లుగా తలపునా రంగ నాయకసాగర్ కాల్వల ద్వారా నీరు పారుతున్న మండల పరిధిలోని మాచా పూర్, ఎల్లాయిపల్లి గ్రామాలకు సాగునీరు అందడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక శ్రద్ద తీసుకొని పైపులైన్ ద్వారా సాగునీరు అందించడంతో శుక్రవారం ఆయా గ్రామాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ కెసిఆర్, హరీష్‌రావు చిత్రపటాలకు పాలాభిషేకంన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చిన్నకోడూరు ప్రాంతంలో రైతులు ఎక్కువగా వాణిజ్య పంటలతో పాటు ఇతర పంటలను పండిస్తారని నీటి వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కెసిఆర్, హరీష్‌రావుల సహకారంతో సాగునీటి వసతి కల్పించడంతో కరువు తొలిగి పోయిందన్నారు. హరీష్‌రావు సొంత నిధులతో పైపులైన్ ఏర్పాటు చేసి ఎల్లాయిపల్లి గండి చెరువుతో పాటు చెక్ డ్యాంలు నింపడానికి నీటి వసతి కల్పించడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి 14నెలలు గడుస్తున్నా రైతుల కళ్లల్లో నీరేచూస్తున్నారు తప్ప సాగునీటిని అందించడం లేదన్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపిపి కీసర పాపయ్య, మాజీ సర్పంచ్‌లు గాజుల బాబు, కాముని ఉమేష్, ఆవుదుర్తి మహేందర్, ఎలేటి రాజారెడ్డి, జంగిటి శ్రీనివాస్, కొండం రవీందర్‌రెడ్డి, ములకల కనకరాజు, తీపిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు, నాయకులు యాట యాదయ్య, గుర్రాల రాజిరెడ్డి, పొన్నం సురేష్, సుంచు ఎల్లయ్య, తేళ్ల కుమార్, రైతులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నర్సారెడ్డి

**వర్గల్, ఫిబ్రవరి 7(ప్రభాతవార్త):** మండలంలోని మాజీ ఎంపిటిసి మేదిని సజనిత బిక్షపతిరెడ్డిల కూతురు సాహితి వివాహం పొద్దుటూరి నిర్మల వినోద్‌రెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డితో శుక్రవారం దేవరయాంజాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సా రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## ఇమాంబాద్‌లో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం

**సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** ఇటీవల తీన్మార్ మల్లన్న రెడ్డిలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యాలపై పట్టణంలోని 15వ వార్డు ఇమాం బాద్ రెడ్డి సంఘం మండిపడింది. శుక్రవారం రెడ్డి సంఘం నుంచి సిద్దిపేట సిరిసిల్ల రోడ్డు వరకు శవయాత్ర నిర్వహించి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, అందరితో కలివిడిగా ఉండే రెడ్డిలను తీన్మార్ మల్లన్న స్వార్థం కోసం ఇష్టారీతిన మాట్లాడడం సరికాదన్నారు. బడుగు బలహీన వర్గాల ఐక్యతను ఏనాడు రెడ్డిలు అడ్డుకో లేదన్నార. రెడ్డిలే అందరితో కలివిడిగా ఉంటూ కలుపుకుపోయే మనస్తత్వం కలిగిన వారని చెప్పారు. తన స్వార్థ రాజకీయ మరేదో ప్రయోజనాల కోసం తీన్మార్ మల్లన్న మరోసారి ఇలాంటి వ్యాఖ్యాలు చేస్తే చూస్తూ ఉరుకోమ న్నారు. సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్సీగా కొనసాగుతూ రెడ్డిల పట్ల హేలనంగా మాట్లాడడం అత్యంత శోచనీయ మన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి సర్కార్ స్పందించి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో విస్తృత పోరాటాలకు సిద్ధం అవుతామన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు పప్పుల కరుణాకర్‌రెడ్డి, పాతూరి శ్రీనివాస్‌రెడ్డి, నాయిని నరసింహ్మారెడ్డి, కృష్ణపల్లి నరసింహ్మారెడ్డి, సుద్దాల సుదర్శన్‌రెడ్డి, కాశిరెడ్డి నాగరాజురెడ్డి, పప్పుల రాజిరెడ్డి, గూడ దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న బొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

# విఆర్‌ఎల వారసులకు ఉద్యోగాలు కల్పించాలి





తహసీల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న విఆర్‌ఏలు

**వర్గల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** విఆర్ఏల వారసులకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ వర్గల్ మండల విఆర్ఏలు శుక్ర వారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో 80 రోజుల పాటు సుదీర్ఘ సమ్మె ఫలితంగా గత ప్రభుత్వం జీవో 81, 85లను విడుదల చేసిందన్నారు. ఈ జీవోను అను సరించి రాష్ట్రంలో ఉన్న 20,555 మంది విఆర్ఏ లలో 16,758 మంది విఆర్ఏలకు పదోన్నతులు ఇచ్చి ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిందన్నారు. ఆ జీవోలో ఉన్న 3797 మంది విఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి 19 నెలలు గడు స్తున్నా నేటికీ విఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వ కుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందన్నారు. పలుమార్లు ముఖ్యమంత్రి, రెవెన్యూ శాఖ మంత్రిని, అధికారులను కలిసి సమస్య విన్నవించడంతోపాటు నిరసనతలు తెలిపినా ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 14 నెలలు అవుతుందని, జీవో ఇచ్చి 19 నెలలుకావస్తుందని, ప్రభుత్వం విఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం కమిటీని వేసి సంవత్సరం అవుతుందని, ఇప్పటివరకు ప్రభుత్వం విఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వకుండా ఎందుకు నిర్ల క్ష్యం చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏల మండల అధ్యక్షుడు మోతెకాని వెంకటయ్య, ఉపా ధ్యక్షుడు మల్లేశం, విఆర్ఏలు మల్లేష్, నర్సింలు, నవీన్, నర్సింలు, రమాదేవి, కనకయ్య, యాదయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్వర్‌టైజ్‌మెంట్ పోల్స్ తొలగింపు

### అక్రమ పోల్స్‌ను గుర్తించి తొలగిస్తాం: హైడ్రా కమిషనర్

**శంషాబాద్ ఫిబ్రవరి 7, ప్రభాతవార్త** హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై శంషాబాద్ ఎయిర్ పోర్ట్ రోడ్డులో శుక్రవారం ఉదయం హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్మెంట్ పోల్స్‌ను గుర్తించి తొలగించే పని లో హైడ్రా నిమగ్నమైంది. పన్ను కట్టకుండా అక్రమంగా నిర్మించిన ప్రకట నల హోర్డింగ్ పాయింట్స్. అక్రమ హోర్డింగ్ లను అధికారులు కూల్చి వేస్తున్నారు. శంషాబాద్ మున్సిపాల్ అధికారుల ఫిర్యాదుతో హైడ్రా కఠిన చర్యలకు దిగింది. శంషాబాద్‌లోని సిద్దాంతి జాతీయ రహదారి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ప్రాంతంలోని హోర్డింగ్‌లను తొలగించడానికి హైడ్రా శుక్రవారం ఉదయం తమ సిబ్బందితో రంగంలోకి దిగింది. పోల్చు తొలగిం పును హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ కొన్ని సంస్థలు ప్రభుత్వం నుండి అనుమతి తీసుకొని ఏర్పాటు చేసినప్పటికీ టాక్స్‌లను చెల్లించకుండా రెన్యువల్ కోసం పెట్టుకు న్నాయని. మరికొన్ని సంస్థలు ఒక పోల్ కు అనుమతి తీసుకొని. అక్రమం గా మరికొన్ని ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. మరికొన్నింటిని ఎలాంటి అనువ ుతి లేకుండా ఏర్పాటు చేశారని వీటన్నింటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. హైడ్రా పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటుచేసిన పోల్చును తొలగించడంతో పాటు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. తొలగింపు కార్యక్ర మంలో శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రతకు చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త :** ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అధికా రులకు సూచించారు. రాజేంద్రనగర్‌లోని ఈవీఎం లను భద్రపర్చే గోడౌన్‌ను శుక్రవారం సందర్శిం చారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్ర స్థాయి ప్రదర్శన జరిపినట్లు కలెక్టర్ తెలిపారు. ఈవీఎం(స్ట్రాంగ్‌రూమ్)గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు కంట్రోల్ యూని ట్లు, వివి ప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరును తనిఖీ చేశారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద పోలీస్ బందోబస్తు తీరును పరిశీలించారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకటరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే

## కుటుంబాలు ఆరోగ్యకర జీవితం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని, తద్వారా వ్యవస్థ కూడ ఆరోగ్యకరంగ ఉంటుందని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళలకు రొమ్ము, గర్భశయ ముఖద్వారా క్యాన్స ర్‌పై నిర్వహించిన హెల్త్ క్యాంపునకు అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి విచ్చేసి పాల్గొన్నారు. డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రఘునాథ స్వామి వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ మెడికల్ డిపార్ట్‌మెంట్ వారు మెడికల్ క్యాంపులు ఉచితంగ వైద్య పరీక్షలు, చికిత్సలు అందించటం సంతోషకరమ న్నారు. కలెక్ట రేట్ సిబ్బంది అందరు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవటానికి ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. మహిళ ఉద్యోగులు ఇంటి పనులు, కార్యాలయ విధులులో నిమగ్నమై తమ ఆరోగ్యం పట్ల కొంత నిర్లక్ష్యం వహిస్తారని, ముఖ్యంగా వారి కోసం ఈ మెడికల్ క్యాంపు ఎంతో దోహదపడుతుందన్నారు. మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టితో రొమ్ము, గర్భశయ ముఖ ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఎంతో ఖరీదుతో కూడుకున్న వైనప్పటికీ వైద్య శాఖ వారు మహిళ ఉద్యోగులకు ఈ పరీక్షలు ఉచితంగ నిర్వహించటం అభినందనీయ మన్నారు. ఈ మెడికల్ క్యాంపులో అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్లు రక్త పరీ క్షలు, బిపి పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య శిబిరంలో 224మంది ఉద్యోగులు పాల్గొనగా, 448మంది రక్తనమూ నాలు తీసుకున్నామన్నారు. 61మందికి సర్వైకల్, 124మందికి ఓరల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ మెడికల్ క్యాంపులో డిఆర్‌డిఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డాక్టర్లు, సిబ్బంది, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## 9 నుండి సమత కుంబ్ మూడవ బ్రహ్మోత్సవాలు

### చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో ఉత్సవాలు

**శంషాబాద్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

శంషాబాద్ మండలం ముచ్చింతల గ్రామంలోని శ్రీరామ నగరంలోని సమతామూర్తి విగ్రహం 108 దివ్య దేశాల ఆలయంలో 2025 ప్రత్యేక కుంభ నిర్వహించడం జరుగుతుందని ఓ ప్రకటన లో తెలిపారు. చిన్న జీయర్ స్వామి స్వీయ పర్యవేక్షణలో జరిగే రామాను జాచార్య 108 దివ్య దేశాల తృతీయ బ్రహ్మోత్సవాల్లో అందరూ పాల్గొనాలని సూచించారు.

# ఉన్నత లక్ష్యాల కోసం నిరంతరం శ్రమించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

విద్యార్థులు ఉన్న త లక్ష్య సాధనకోసం నిరంతరం శ్రమించాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని శివారెడ్డిపెట్ అనంతగి రిపల్లి లోని తెలంగాణా సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో అదనపు కలెక్టర్ సుధీర్ గురువారం రాత్రి బస చేశారు. గురు కుల పాఠశాలలోని సమస్యలను విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో పాటు భోజనం చేశా రు. విద్యార్థులకు అందిస్తున్న భోజ నం, రోజువారి దినచర్య గురించి అదనపు కలెక్టర్ ఆరా తీశారు. హాస్టల్ పరిసరా లను, వంటశాలను, మరుగుదొడ్లను, త్రాగు నీటి సంపును పరిశీ లించారు. మెనూ చార్ట్ ను పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందిస్తు న్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజన విషయం లో రుచి, శుభ్రత పాటించాలని అన్నారు. విద్యార్థులతో కలిసి కాసేపు సరదాగా ముచ్చటించారు. విద్యార్థులు ఉండే గదులను, క్లాస్ రూమ్ లను పరిశీలిం చారు. విద్యార్థులకు రూములను పరిశుభ్రంగా పెట్టుకోవాలని సూచించా రు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మాట్లాడుతూ, ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు కష్టపడిచదివి తల్లిదండ్రులకు గురువులకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజన విషయంలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కువ కాలం నిల్వ ఉంచిన సరుకు లను వాడొద్దన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వినాలని విద్యార్థులకు సూచించారు. మంచిగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత స్థానాలను అధిరోహించ వచ్చని విద్యార్థులకు హితబోధ చేశారు. విద్యార్థులకు చదువు అందించడంతోపాటు వారి ఆరోగ్యం పట్ల కూడా శ్రద్ధగా ఉండాలన్నారు. తల్లిదండ్రులకు దూరంగా ఉంటూ చదువుతున్న పేద విద్యార్థులను మన బిడ్డలుగా భావించి వారిని మరింత జాగ్రత్తగా చూసుకో వాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తించాలన్నారు. శుక్రవారం ఉదయ ము విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేసి, నాణ్యత ప్రమాణల ఎపా టిస్తూ, మంచి రుచి కరమైన భోజనం పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డెన్‌లు తప్పనిసరిగా హాస్టల్ లోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ కృష్ణకుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల కోసం.. ముందస్తు ఏర్పాట్లు

### ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలకు కసరత్తులు షురూ..?
### జిల్లాలో కొత్త మున్సిపాల్టీల యోచన లేనట్లే..
### స్థానిక పోరుకు సిద్ధమవుతున్న రాజకీయ ఆశావహులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా పరిధిలోని మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలా ల్లో స్థానిక సంస్థల ఎన్నికల కోసం అధికార యంత్రాంగం ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితా సిద్దం, అభ్యంతరాలు ఉంటే తెలుపవచ్చని మండలాల వారీగ ఎంపిడిఓలు రాజకీయ పార్టీల అధ్యక్షులతో, నాయకులతో సమావేశాలు నిర్వహించటం జరిగింది. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, వార్డులు, సర్పంచులు, ఎంపిటిసి స్థానాలు, జడ్పీటిసి స్థానాలు వంటి వివరాలు స్థానిక సంస్థల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న మండలాల, గ్రామపంచాయతీల వారీగ వివరాలు, ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాల వివరాలు సంబంధిత జిల్లా అధికారులు నివేధికలు ఇప్పటికే పంపటం జరిగింది. త్వరలో ఎన్నికలు వచ్చినా సిద్దంగ ఉండటానికి అధికార యంత్రాం గం ముందస్తు ఏర్పాట్లు చేస్తుంది. మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లో ముందుగా ఎంపిటిసి, జడ్పీటిసి స్థానాలకు ఎన్నికలు రావచ్చున్న సూచనలతో ఇప్పటికే అధికార యంత్రాంగం అన్ని సిద్ధం చేస్తుంది. మేడ్చల్ జిల్లాలో మూడు మండలాలకు ఎన్నికలు నిర్వహించే దిశగానే అధికారులు మాత్రం ఏర్పాట్లుచేస్తున్నారు. గతంలో జిల్లా వ్యాప్తంగ 61 గ్రామపంచాయతీలు ఉండగ, వీటిలో 28 గ్రామపంచాయతీలు సమీప మున్సిపాల్టీల్లో విలీనం చేసిన సంగతి తెలిసిందే. అయితే మిగతా 33 గ్రామపంచాయతీలు ఉండగ, మరొకటి ఘనపూర్‌కు కొత్త గ్రామపంచాయ తీని గుర్తించింది. మూడు మండలాలాల్లో 19ఎంపిటిసి స్థానాలకు, 3జడ్పీ టిసి స్థానాలకు, 34 గ్రామపంచాయతీల సర్పంచులకు, వార్డుమెంబర్ల పదవులకు ఎన్నికలు నిర్వహించటానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తుంది. ముందుగా ఎంపిటిసి,జడ్పీటిసి ఎన్నికలు జరగవచ్చుని అధికార, అనధికార వర్గాలు భావిస్తున్నాయి. ఆ తరువాతనే గ్రామపంచాయతీ లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంటుందని చెప్పవచ్చు. అయితే ఇటీవల జిల్లాలో ఐదు మండలాలు మేడ్చల్, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కీసర, ఘట్‌కేసర్ మండలాలు ఉండగ వీటిలో కీసర, ఘట్‌కేసర్ మండలాలు మున్సిపాల్టీల్లో విలీనం జరుగగా, ఇక మూడు మండలాలు మాత్రమే జిల్లాలో మిగలటం తో వీటిని కూడ మున్సిపాల్టీలు చేసే అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరిగింది. అయితే జిల్లా పరిషత్ ఉండాలంటే ఐదు, ఆరు మండలాలు ఉండాలని ఏమి లేదని, మూడు మండలాలు ఉన్నా ఎన్నికలు జరపవచ్చున్న భావన అధికారుల నుంచి వెల్లడవుతున్నందున ఇక మండలాలకు, గ్రామపంచాయతీలకు జిల్లాలో ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని, మిగిలిన గ్రామాలను మున్సిపాల్టీలు చేయాలని ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లలేదని, కొత్త మున్సిపాల్టీల ఏర్పాటు ఇక లేనట్లేనని, ప్రభుత్వం నుంచి వస్తే మాత్రం ఆలోచిస్తామని, ఇప్పటి వరకు మాత్రం రాలేదని గ్రామపంచాయతీలు మున్సిపాల్టీలుగా మారె అవకాశం అంటూ లేదని జిల్లా అధికారులు స్పష్టం చేస్తుండటంతో ప్రస్తుతం మాత్రం గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లకు ఎన్నికలు ప్రభుత్వం నిర్వహిం చవచ్చని తెలుస్తుంది. స్థానిక సంస్థలలో ముందుగా ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించటానికే రాష్ట్ర ప్రభుత్వం సిద్దంగా ఉన్నట్లు స్పష్టం అవుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం ఎప్పటికపుడు ఏర్పాట్లను సిద్దం చేస్తుండటంతో స్థానిక పోరుకు రాజకీయ పార్టీలు సిద్దం అవుతున్నట్లు చెప్పవచ్చు. ముందుగా ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు నిర్వహించాకనే గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు స్పష్టం అవుతుండటంతో గ్రామాల్లో మాత్రం రాజకీయంగా చర్చలు కొనసాగుతున్నాయి.





మాట్లాడుతున్న రఘోత్తం రెడ్డి

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:**

విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి, గౌరవాన్ని పెంపొం దించడమే లక్ష్యంగా పనిచేస్తానని కరీంనగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎంఎల్‌సి అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగిన కూర రఘోత్తంరెడ్డి ఎన్నికల ప్రచార పర్యటనలో భాగంగా ఎస్టియు భవన్ సంగా రెడ్డిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ఉపాధ్యాయ సంక్షేమ, విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తూ.. విద్యారంగ ఉపాధ్యాయ సమస్యలపై, విలువలకు,నిజాయితీకి నిబద్ధతకు కట్టుబడి పని చేశానన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాలకు బాసటగా నిలిచి, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థలు బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఎస్‌టియుటిఎస్ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు సయ్యద్ సాబేర్ అలి,శ్రీనివాస్ రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ కుమార్ ,జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్ ,నిజాంపేట మండలం అధ్యక్షులు విజయకుమార్, పటాన్చెరు మండల అధ్యక్షులు సుందర్‌రావు, సదాశివపేట మండల అధ్యక్షులు నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు అల్లం ప్రతాపరెడ్డి, గెజిటెడ్ హెడ్మాస్టర్ శ్రీసురేష్, యాదవ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణ, స్వతంత్రం, కిషన్, రాజ్ కుమార్, సుమన్ లత , లలితాంబిక, ఖయ్యూం, ఎన్కేశాలి, సమీ, జీవన్ రాథోడ్, బషీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## కొమురవెల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ట

**కొమురవెల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని కొమురవెల్లిలో శుక్రవారం శ్రీ వార ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ప్రతిష్టించారు. గ్రామ యువత పార్టీలకు అతీతంగా ఎలాంటి సంస్థలకు సంబంధం లేకుండా శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్టించారు. అనంతరం గ్రామ యువత ఛత్రపతి శివాజీ అడుగుజాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ప్రభుత్వ పాఠశాలకు నీటి శుద్ధి యంత్రం వితరణ

**బెజ్జంకి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త :** తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడేలా నీటిశుద్ధి యంత్రాన్ని బహూకరించి పాఠశాలపై వారికున్న ప్రేమను చాటుకున్నారు. మండల పరిధిలోని చీలా పూర్‌లోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2008-09లో టెన్త్ చదివిన విద్యార్థులు శుక్రవారం రూ.25 వేల విలువచేసే నీటిశుద్ధి యంత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను, ఉపాధ్యాయులు, గ్రామ స్థులు అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పైడి నాగరాజు, ఎం.డి. అజారుద్దీన్, పంతం మనోజ్, బండిపల్లి ప్రవీణ్, శ్రీరాములు, హరీష్, గ్రామస్తులు శానగొండ శరత్, ఎరవెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆడబిడ్డకు పుస్తెలు, మెట్టెలు అందజేత

**మర్కుక్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామానికి చెందిన చెక్కల పెంటమ్మ, నర్సింలు దంపతుల కూతురు మమత వివాహానికి జిల్లా ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు, బిఆర్ఎస్ బిసి సెల్ మండల అధ్యక్షుడు మేకల కనకయ్యముదిరాజ్ శుక్రవారం పుస్తెలు మెట్టెలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఆయన తో పాటు చెక్కల మల్లేశం, చెక్కల కరుణాకర్, కొట్టాల మహేష్ ఉన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

**గజ్వేల్, ఫిబ్రవరి 7 (ప్రభాతవార్త):** గజ్వేల్ మండలం అక్కారం గ్రామం లో ప్రభుత్వ పాఠశాలలో జయన్ వేర్ హౌస్ చైర్మన్ కళ్ళేపు నవీన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు చెప్యాల రాజేశ్వర్‌రావు శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానానికి వెళ్ళాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమవంతు ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అక్కారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ గునిశెట్టి బాల్‌చంద్రం, పాఠశాల సంఘం అధ్యక్షుడు మాధగారి చంద్రం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

**పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద ఇద్దరు లబ్దిదారులకు మంజూరైన చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. మండల పరిధి లోని జుక్కల్ గ్రామానికి చెందిన మల్లేశంకు మంజూరైన రూ. 21,500 చెక్కును, మూసాపేట గ్రామానికి చెందిన సారా అశోక్‌కు మంజూరైన రూ. 12,000 చెక్కును లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు రమేష్, వెంకటరెడ్డి, సురేష్ గౌడ్, మాణిక్ రెడ్డి, యాదుల్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డ వివాహానికి పుస్తెలు, మెట్టెలు అందజేత

**కొల్చారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** పేదింటి ఆడబిడ్డల పెళ్ళిళ్లకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి తనవంతు సహాయం అందజేస్తు న్నారు. శుక్రవారం కొల్చారం మండలం పోతోంశెట్టిపల్లి గ్రామానికి చెందిన చీమల నర్సమ్మ, పోచయ్య దంపతుల కుమార్తె నీరజ వివాహానికి తన వంతుగా పుస్తెలు, మెట్టెలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాతూరి దయాకర్‌గౌడ్, గుండు నాని, సాయిని మహిపాల్, మంగలి విజయ్, పాతూరి సురేష్, బసన్నగారి సతీష్ తదితరులు ఉన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**కొల్చారం, ఫిబ్రవరి 7 ప్రభాతవార్త:** మండలకేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు పట్లోరి నర్సింలు, వెంకటలక్ష్మీ దంపతుల కుమారుడు పట్లోరి కిరణ్‌కుమార్, అనూషల వివాహం శుక్రవారం తూప్రాన్ పట్టణం లోని దేవి గార్డెన్స్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వ దించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, శివ్వంపేట మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, చౌరిగారి చిన్న రాములు, సార సుదర్శన్, చౌరిగారి ఆంజనేయులు, నాయకులు గ్యాస్ కృష్ణ, ముత్యం ప్రవీణ్ కుమార్, నింగోల చెన్నయ్య, చౌరిగారి కిషన్, సత్యనారాయణ, పాండ్ర శ్రీనివాస్, ఎర్రోళ్ల శ్రీనివాస్, నేరెళ్ల చంటయ్య, పాండ్ర వెంకటేశం, ఎండుగుల కృష్ణ, అరికెల నాగయ్య, రాజా గౌడ్, సాతల్లి శేఖులు, ముత్యం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## నూతన వధూవరులను చంద్రశేఖర్‌రెడ్డి ఆశీర్వాదం

**నిజాంపేట్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** శుక్రవారం మండలపరిధిలోని ర్యాలమడుగు గ్రామానికి చెందిన దొంతిగారి సాయిలు కుమార్తె వివాహ వేడుకల్లో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ జగ్గప్ప, రమేష్ పాల్గొన్నారు.

## జానపద గాయని యశోద ఉత్తమ అవార్డు

**యాచారం ఫిబ్రవరి 7 ప్రభాతవార్త** తెలుగు వెలుగు సాహితీ కళావేదిక వారు స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలలో భాగంగా 2025 విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వివిధ రంగాల్లో నిష్ణాతులైన కవులు కళాకారులకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 100మంది కళాకారులకు అందించిన జాతీయ అవార్డుల అందజేశారు. కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా యాచారం మండలం తాడిపర్తి గ్రామం చెందిన కొప్పు యశోద జానపద గాయకురాలికి నంది పురస్కారం లభించింది ముఖ్య అతిథిగా విచ్చేసిన గౌరవనీయులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ , మాజీ డిప్యూటీ స్పీకర్ ప్రస్తుతం అవనిగడ్డ శాసనసభ్యులు చేతుల మీదుగా ప్రశంస పత్రం సీల్డ్ నంది అవార్డు అందజేశారు. గాయనిగా కళారంగానికి విశేషమైన కృషి చేసినందుకు గాను అవార్డు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ కళా రత్న బ్రహ్మశ్రీ పోలోజు రాజ్ కుమార్ ,జాతీయ చైర్మన్ తెలుగువెలుగుసాహితి వేదిక డాక్టర్ మండల లక్ష్మణ్ బాబు, ప్రముఖ చిత్రకారులు ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు తెలుగు వెలుగు సాహితీ వేదిక బ్రహ్మశ్రీ అద్దంకి నాగరాజు తదితరులు అభినందించారు.

## నీలకంఠుడికి మహాపడిపూజ

-శివనామస్మరణతో మార్మోగిన నార్సింగ్

**పాపన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలపరిధిలోని నార్సింగ్‌గ్రామం గురువారం శివనామస్మరణతో మార్మోగింది. శుక్రవారం గ్రామంలో శివస్వాములు మహాపడిపూజ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శివస్వాములు నీలకంఠులై నృత్యాలు చేయగా దారి దేవుడీ ఆలయ అర్చకులు వేదమంత్రాలతో అభిషేకాలు నిర్వహించగా శివస్వాములు అర్ధనారీశ్వరుడికి రుద్రాభిషేకాలు నిర్వహించి పడిముట్టివ్వగా వందలాదిగా తరలివచ్చిన శివస్వాములు కీర్తనలు చేసి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అంతకుముందు గ్రామంలోని పుర వీధుల గుండా శివుడిని పల్లకిలో ప్రతిష్ఠించుకుని బాజాభజంత్రీలతో ఉత్సాహంగా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంపై ప్రతిష్ఠించుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో జొన్న ప్రసాద్, నర్సింలు, గోపాల్‌రెడ్డి, చంద్రయ్య, ఆయాప్రాంతాల శివస్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

-ఎస్‌ఐ విజయ్‌భాస్కర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విజయ్‌భాస్కర్

**అక్కన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, మనిషి జీవితంలో విద్యార్థిదశ చాలా ముఖ్యమైనదని ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కట్కూర్‌గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులకు షీటీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, బాలికలు, మహిళలకు ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని లక్ష్యసాధనకు ప్రయత్నాలు చేయాలన్నారు. చదువుకు సమయంకేటాయిస్తే భవిష్యత్తులో బాగుపడతారని లేదంటే జీవితాంతం ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముఖ్యంగా అమ్మాయిలు అకతాయిల అల్లర్లు, పొగడ్తలకు పడిపోయి మోసపోవద్దన్నారు. విద్యార్థు వారి తల్లితండ్రుల కష్టాలను మరిచిపోవద్దన్నారు. వారికి ఎలాంటి అవసరాలు వచ్చినా లోన్ యాప్స్ ద్వారా లోన్లు తీసుకోవద్దని, బెట్టింగులు, మద్యపానం, ధూమపానం, గంజాయిలాంటి వ్యసనాలు ఆరోగ్యానికి హానికరమని, వాటికి బానిస కావద్దన్నారు. ప్రతివిద్యార్థి కూడా వారికి ఉన్నహక్కులను చట్టాలను గురించి అవగాహనకలిగి ఉండాలన్నారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘు, షీటీమ్‌బృందం, సదయ్య, ప్రశాంతి, కృష్ణతోపాటు తదితరులు ఉన్నారు.

## సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న గిరిజన నాయకుల దృశ్యం

**అక్కన్నపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్యదైవం అయిన శ్రీసంత్‌సేవాలాల్ జయంతి వేడుకను ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని గోర్‌సేవా జిల్లా అధ్యక్షులు గుగులోతు రాజునాయక్ డిమాండ్‌చేశారు. శుక్రవారం అక్కన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఒకే భాష, ఒకే యాస మాట్లాడే గిరిజనులు 12కోట్లకు పైగా ఉన్నజాతి ఆరాధించే దైవం సేవాలాల్ అని అలాంటి రోజును ఆప్షనల్ హాలీడేగా కాకుండా పూర్తి సెలవుగా ప్రకటించి ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు రాజునాయక్, అర్జున్ నాయక్, శ్రీనివాస్, రాథోడ్, సురేష్, శ్రీనివాస్, యుగేందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాతాశిశు ఆసుపత్రిని వెంటనే ప్రారంభించాలి

-బిఎస్పి నియోజకవర్గ అధ్యక్షులు రవిందర్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రవిందర్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణకేంద్రంలో రూ.7కోట్లతో నిర్మించిన మాతాశిశు ఆసుపత్రిని ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ డిమాండ్‌చేశారు. శుక్రవారం తమ పార్టీ శ్రేణులతో కలసి ఆసుపత్రిని సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో ఈ ఆసుపత్రి ప్రారంభమైతే చుట్టుపక్కల మండలాల గర్భిణీస్త్రీలతో పాటు పిల్లలకు మెరుగైన వైద్యం అందుతుందని ఇప్పటివరకు ఇక్కడ చిన్నపిల్లలు గర్భిణీస్త్రీలకు సంబంధించిన మంచి ఆసుపత్రులు లేవని, వారికి ఎలాంటిసమస్య వచ్చినా కరీంనగర్, సిద్ధిపేట, వరంగల్‌లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఈవిషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శంకర్, వెంకటేష్, వెల్పుల రాజు తదితరులు ఉన్నారు.

## దర్గాను దర్శించుకున్న బిఆర్ఎస్ నాయకులు



పీర్‌గైబ్‌సాహెబ్ దర్గాను దర్శించుకుంటున్న బిఆర్ఎస్ నాయకులు

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామశివారులోని కొండగట్టుపై కొలువున్న ఉర్సే షరీఫ్ హజరాత్‌పీర్ గైబ్‌సాహెబ్ దర్గాను (న్యాల్‌కల్‌జాతర) శుక్రవారం బిఆర్ఎస్ నాయకులు దర్శించుకని ప్రత్యేకప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో జాతర ఉత్సవకమిటీ అధ్యక్షులు యూనుష్‌ఖాన్, బిఆర్ఎస్ నాయకులు బోడ భాస్కర్, సంజీవ్, ప్రవీణ్, శ్రీనివాస్, సురేష్, అంజి, ముస్తఫా, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుకు మేం వ్యతిరేకం కాదు

-కలిసి పోరాడుదాం

-స్థానిక ఎమ్మెల్యే స్పందించాలి

-టిపిసిసి కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి

-కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షులు పుట్ట నర్సింగరావు



విలేకరులతో టిపిసిసి కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుట్టి నర్సింగరావు

**గుమ్మడిదల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్టి నర్సింగరావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పాటుచేసి అనుమతులు ఇచ్చినట్లు బిఆర్ఎస్, బిజెపి నాయకులు కాంగ్రెస్‌పై బురద జల్లే రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉన్నప్పుడే 2015 లోనే డంపింగ్ యార్డ్‌కు బీజం ఏర్పడిందని, పూర్తి అనుమతులు ఆగస్టు 1, 2023 వరకే వచ్చాయని, అప్పుడు కూడా అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వం సర్వాధికారాలు ఇచ్చి చేతులు దులుపుకోవడం జరిగిందన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీపై బురదజల్లి స్థానిక ఎన్నికల్లో లబ్ది పొందాలని చూడటంపై ధ్వజమెత్తారు. కలిసికట్టుగా ముందుకు వస్తే పార్టీలకతీతంగా ఈప్రాంతం కాపాడుకోవడం కోసం ముందుంటామని వారన్నారు. నల్లవల్లి ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటుకు సంబంధించి ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలని వారు కోరారు. మండలనాయకులు, అన్నిగ్రామాలప్రజలు కలిసికట్టుగా జెఏసిగా ఏర్పడి డంపింగ్ యార్డ్ నిలుపుదల కోసం స్థానిక ఎమ్మెల్యే, మంత్రులను కలిసి డంపింగ్‌యార్డ్ ఏర్పాటుతో జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రికి తెలిసేవిధంగా కార్యాచరణ చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుచేయడం వల్ల జరిగే నష్టాన్ని అధికార యంత్రాంగానికి తెలియజేసి అందరం ఏకమై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మన ఓట్లతో గెలిచి మూడోసారి ఎమ్మెల్యేగా ఎన్నుకోబడిన స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దీనిపై స్పందించి గుమ్మడిదల మండలప్రజలకు జవాబు చెప్పాలని స్పష్టం చేశారు. గత నాలుగురోజులుగా మండలంలో పార్టీలకతీతంగా స్థానిక నాయకులను అరెస్టు చేసి తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తంచేస్తున్నామన్నారు. గతంలో రైతుల వ్యవసాయభూమి ఎయిర్ ఫోర్స్ అకాడమీ నిర్మాణానికి, డిఆర్‌డిఏ నిర్మాణానికి, పరిశ్రమలకోసం 70శాతం భూమి పోగా, మిగిలినభూమిలో వ్యవసాయంమీద ఆధారపడిన రైతులనోట్లో మన్నుకొట్టి, ఇప్పుడు డంపింగ్‌యార్డ్ పేరుతో ఉన్న వ్యవసాయభూమి కలుషితమై వ్యవసాయంతో ఆధారపడిన గ్రామాలు పూర్తిగా కనుమరుగయ్యేస్థితి ఏర్పడిందని అన్నారు. పచ్చని వృక్షరాశులు, పచ్చని పైరుపంటలు, పశు సంపద, రైతులను కోల్పోవడం జరుగుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ టిపిసిసి కార్యవర్గ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు, జిన్నారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిన్నారం మండల అధ్యక్షుడు వడ్డే కృష్ణ, మాజీ అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి, మద్ది ప్రతాప్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, ముద్దుల పెంటారెడ్డి, తులసిదాస్, బాలుగౌడ్, పడమటి మహిపాల్ రెడ్డి, ఆకుల ఆంజనేయులు, అంజద్ ఖాన్, గారాల మల్లేష్, జంగారెడ్డి, గడ్డపోతారం శ్రీనివాస్, కృష్ణ గౌడ్, సురభి వినోద్ గౌడ్, సురభి కుమార్ గౌడ్, బిక్షపతి, రామ్ రెడ్డి, రాము, కానుకుంట వెంకటేష్, యాదగిరి, యూత్ కాంగ్రెస్ రాహుల్, సుధాకర్, నల్తూర్ సురేష్, మల్లేష్, సందీప్, అన్ని గ్రామాల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ప్రేరణ కార్యక్రమం నిర్వహణ



విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న వందేమాతరం ఫౌండేషన్ అధినేత రవీందర్ రావు, జిల్లా విద్యాధికారి రాధాకిషన్

**కొల్చారం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** కొల్చారం మండలపరిధిలోని రంగంపేటగ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రధానోధ్యాయులు ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన ప్రేరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వందేమాతరం ఫౌండేషన్ అధినేత రవీందర్‌రావు, జిల్లావిద్యాధికారి రాధాకిషన్‌లు హాజరయ్యారు. ప్రేరణ కార్యక్రమానికి మండలంలోని కొంగోడు, ఎనగండ్ల, పోతంశెట్టిపల్లి, చిన్నఘనపూర్ తదితర పాఠశాలల నుండి పదవతరగతి చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లావిద్యాధికారి రాధాకిషన్, పాఠశాలకమిటీ అధ్యక్షురాలు చండీప్రియ, ఉపాధ్యాయులతో కలిసి జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవతరగతి భవిష్యత్తుకు పునాది అని, విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికితీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రతివిద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, పదవతరగతి ఫలితాల్లో 10 జిపిఏ సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కబడ్డీ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని అక్షయను సన్మానించి అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపేందర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు రమేష్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## భక్తమార్కండేయ ఆలయ వార్షికోత్సవాలు



అల్లాదుర్గంలో భక్త మార్కండేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన అల్లాదుర్గంలోని భక్త మార్కండేయ దేవాలయంలో శుక్రవారం 41వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. 41వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమానికి గ్రామస్థులతోపాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో చేరుకుని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు (అన్నదానం) అందచేశారు.

## కాళికాదేవి ఆలయంలో మహాపడి పూజ



కాళికాదేవి ఆలయంలో మహాపడిపూజలో పాల్గొన్న భక్తులు

**మునిపల్లి, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సదాశివపేట పట్టణంలోని కాళికాదేవి ఆలయం ఆవరణలో శుక్రవారం రమేష్ గురుస్వామి దంపతుల సమక్షంలో జ్యోతిర్లింగ మహాపడి పూజా కార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. మహాపడి పూజాకార్యక్రమానికి ఆయాప్రాంతాల నుంచి 200మంది శివస్వాములు చేరుకుని పడిపూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయులు చింత సాయినాథ్, గురుస్వామి బసవరాజు, శంకర్ గురుస్వామి, శివస్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ఆలయానికి చేరుకున్న భక్తులకు, శివస్వాములకు ప్రసాద వితరణ (భిక్ష) చేశారు.

## రహదారిపై బైఠాయించి ధర్నా

**గుమ్మడిదల, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** గుమ్మడిదలమండలం నల్లవల్లిగ్రామ పంచాయతీపరిధిలోని ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డ్ ఏర్పాటు ప్రతిపాదనలపై గ్రామస్థుల నిరసనలు మూడవ రోజు కొనసాగాయి. గ్రామప్రజలు ప్రధానరహదారిపై బైఠాయించి నిరసన తెలియజేస్తూ డంపింగ్‌యార్డ్‌ను రద్దుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. గ్రామ మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు నిరసన నిర్వహిస్తున్నారు. “పర్యావరణాన్ని కాపాడండి, భూములను కలుషితం చేయొద్దు” అంటూ నినాదాలు చేస్తున్నారు. డంపింగ్‌యార్డ్ వల్ల భూగర్భజలాలు, పంటభూములు కలుషితమవుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనను ఇంకా ఉధృతం చేస్తామని, డంపింగ్‌యార్డ్ నిర్మాణాన్ని రద్దుచేసే వరకు పోరాటంచేస్తామని హెచ్చరించారు. నిరసనలు తీవ్రరూపం దాల్చకుండా ఉండేందుకు పోలీసులను భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మండలవ్యాప్తంగా మున్సిపాలిటీలో, గ్రామాల్లో పోలీసులు గట్టినిఘా పెట్టారు. గ్రామాలలోని ప్రజలు, విద్యార్థులు, యువకులు, మహిళలు, వృద్ధులు స్వచ్ఛందంగా రోడ్డుపైకివచ్చి నిరసన వ్యక్తంచేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

**అల్లాదుర్గం, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన అల్లాదుర్గంలోని బాలుర జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కేంద్రాలను శుక్రవారం మండల విద్యాధికారి ధనుంజయ, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డిలు పరిశీలించారు. ఓటర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకునే ఓటర్లకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా తగు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారి, ఎస్‌ఐ సూచించారు.

# ఉత్తమ పశుపోషకులకు బసవ అవార్డులు

-న్యాల్‌కల్ జాతరలో ఆదివారం పంపిణీ



న్యాల్‌కల్ జాతరలో రైతులకు బసవ అవార్డులు అందచేస్తున్న డాక్టర్ బస్వరాజ్ (ఫైల్‌ఫోటో)

**న్యాల్‌కల్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మూగజీవాల ప్రేమికుడు మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన శిల్పకళలో మాస్టర్స్ పూర్తి చేసుకుని శిల్పకళలో డాక్టర్ పట్టా అందుకుని ఎందరో ప్రముఖులచే అవార్డులందుకున్న ప్రముఖ కళాకారులు డాక్టర్ హోతి బస్వరాజ్ ఉత్తమ పశు పోషకులకు 18వమారు ఉత్తమ బసవ అవార్డులను (తనతల్లిదండ్రులు, అన్నకుమారుడు హోతి గిరిజబాయి, అడివప్ప దంతపులు, హోతి సురేష్‌ల జ్ఞాపకార్థం) అందచేసేందుకు తగు ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. మండలకేంద్రమైన న్యాల్‌కల్ గ్రామ శివారులో కొండగట్టుపై కొలువున్న హజరత్ పీర్‌గౌబ్ సాహెబ్ ఖిల్లా దర్గా ఉత్సవాలు ఈ నెల 7న ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రతి సంవత్సరం (జనవరి లేదా ఫిబ్రవరి మాసాల్లో) పౌర్ణమి సందర్భంగా శుక్రవారం న్యాల్‌కల్ జాతర ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. జాతరలో భాగంగా ఆదివారం జరిగే పశువులసంతకు ఆయా ప్రాంతాల నుంచి వేలసంఖ్యలో మూగజీవాలను జాతరకు తీసుకువస్తారు. జాతరకువచ్చే మూగజీవాల (ఎడ్లు, ఆవులు, లేగదూడలు, కొళాగ్యలు) లో ఉత్తమపశువులను ఎంపికచేసి వాటిని పోషించే రైతులకు బసవ అవార్డులు అందచేయడం గత కొన్నిసంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 9న జాతరలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసే కార్యక్రమంలో రైతులకు అవార్డులు అందచేసి డాక్టర్ హోతి బస్వరాజ్ సన్మానిస్తూ ఉంటారు.

## మహమూద్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**రాయికోడ్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన సంఘటన మండలపరిధిలోని రాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికిచెందిన బుర్జుకాడి మహమూద్‌ను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేవెళ్ల విఠల్, పార్టీనాయకులతో కలిసి పరామర్శించారు. గురువారం రాయిపల్లిగ్రామానికి చేరుకుని మహమూద్‌ను కలుసుకుని ఇల్లుకాలిపోయిన తీరును అడిగితెలుసుకున్నారు. ప్రభుత్వపరంగా వచ్చే ఆర్థికసహాయాన్ని అందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చేవెళ్ల విఠల్, వీరభద్రేశ్వర ఆలయకమిటీ మాజీచైర్మన్ సంగమేశ్వర్‌పాటిల్, మండల యూత్ అధ్యక్షులు అంజిముదిరాజ్, తెలంగాణ మలిదశ ఉద్యమనాయకులు కావీ బస్వరాజ్‌పాటిల్, మాజీ ఎంపిటిసి సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీసర్పంచ్ అడివయ్య, మహిపాల్‌రెడ్డి, నాయకులు జైపాల్‌రెడ్డి, నరేష్, నాగేష్, కుమ్మరి అశోక్, బాలయ్య పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన చంద్రశేఖర్‌రెడ్డి

**మనూర్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలపరిధిలోని తిమ్మాపూర్‌గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు బాబురావు కుమారుడి వివాహం శుక్రవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. వివాహవేడుకలకు డిసిసి ప్రధానకార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి కుటుంబసభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రశేఖర్‌రెడ్డితోపాటు కాంగ్రెస్‌నాయకులు నారాయణరావు, గోవింద్‌రావు, మాధవ్‌రావు, జైరాజ్, నర్సింలు, బి.రాజు, జానీపటేల్, చందర్, శ్రీకాంత్, బీరప్ప పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి



మాట్లాడుతున్న నాయకుల దృశ్యం

**హుస్నాబాద్‌టౌన్, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కూలీకివెళ్లి మృతిచెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.30లక్షలతోపాటు గాయపడిన కూలీలకు రూ.10లక్షలచొప్పున నష్టపరిహారాన్ని అందించాలని ఆల్ ఇండియా ఫార్వడ్ బ్లాక్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్ డిమాండ్‌చేశారు. శుక్రవారం పట్టణకేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉపాధికూలీకి వెళ్లిన ఇద్దరుకూలీలతోపాటు మరికొంతమందికి తీవ్రగాయాలై పదిరోజులు గడుస్తున్నా ప్రభుత్వం ఇప్పటివరకు పరిహారం అందించకపోవడం సిగ్గుచేటన్నారు. బాధిత కుటుంబాలలో అర్హులైనవారికి ప్రభుత్వోద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అధికారుల పర్యవేక్షణాలోపంగా జరిగిన ఈప్రమాదానికి కారణమైన ప్రతి అధికారిపై చర్యలుతీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి గీకురు చిరంజీవితోపాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారిన వేళ



జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** సమయపాలన, క్రమశిక్షణ, కార్యాచరణ అలవాటవ్వాలంటే పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని సూరారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలపరిధి సూరారం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. జిల్లావిద్యాధికారిగా ప్రణవి, జిల్లాకలెక్టర్‌గా భవిత, మండల విద్యాధికారిగా శైలజలు వ్యవహరించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనీష్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శిల్ప, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గీతం ప్రమాణ 2025 ప్రారంభం



గీతం విద్యార్థినులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న వార్షికోత్సవం ప్రమాణ 2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. సాంకేతిక, సాంస్కృతిక, సంక్షేమ కార్యక్రమాల మేలుకలయిక అయిన ఈవేడుక ప్రారంభోత్సవంలో సంగారెడ్డి జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్ ముఖ్యఅతిథిగా, ఎస్ఎన్‌వైసిఎస్ గ్రూపు ముఖ్య కార్యనిర్వహణాధికారి, వ్యవస్థాపకుడు శ్రహంజ్ ఆత్మీయఅతిథిగా పాల్గొన్నారు. విశేషమైన విజయాల కోసం కృషిచేయాలని, అత్యుత్తమ ప్రదర్శనకు తమనుతాము సన్నద్ధం చేసుకోవాలంటూ విద్యార్థులను ఎస్పీ ప్రేరేపించారు. హద్దులను అధిగమించి ఆయావ్యక్తుల అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా జీవితంలోరాణించాలని శ్రహంజ్ సూచించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ వితర్ శాస్త్రి, ప్రమాణ 2025 అధ్యాపకసలహాదారు డాక్టర్ పి.త్రినాథరావు, డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్ ప్రతినిధులు, పలువురు అధ్యాపకులు, తదితరులు ఈప్రారంభోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ప్రఖ్యాత కళాకారులు నికితా గాంధీ, మంగ్లీ తమపాటలతో యువతను ఉర్రూతలూగించారు. ప్రమాణ 2025 విద్యార్థులు తమ సృజనాత్మకత, ఆవిష్కరణ, సమగ్రతను ప్రదర్శించడానికి ఒక శక్తివంతమైన వేదికగా ఉంటుందని హామీ ఇవ్వడమే గాక, అవధులులేని ప్రతిభాస్ఫూర్తిని చాటిచెబుతోంది.

## ఆపదలో అండగా సిఎం సహాయనిధి

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 7, ప్రభాతవార్త:** పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తుందని కాంగ్రెస్‌పార్టీ మండలాధ్యక్షుడు సాన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 26మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం సాన సత్యనారాయణ అందించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ సర్పంచులు రాజారెడ్డి, రాజాసింగ్, నాయకులు కోడూరి రమేష్‌గౌడ్, జీవన్, సందీప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.